# రాబందుల రెక్కల చప్పుడు

ముందే వెన్నెముక విరిగింది. ఆ పిమ్మట కళ్ళు రాయలసీమ బావులయ్యాయి. ఇప్పుడేమో నీళ్ళు లేక నాలిక దాహంతో పిడచకట్టుకుపోతోంది. ఇక ఆ రైతు ఎలా ఉంటాడో ఎలా నడుస్తాడో - అలాగే ఉన్నాడు అలాగే నడుస్తున్నాడు చెంచయ్య.

"వోయ్ చెంచయ్యా" రామిరెడ్డి పిలిచాడు.

ఆగి ఎందుకన్నట్టు చూశాడు.

"ఇక్కడా!"

వచ్చాడు.

"మా బావ మదనపల్లి నుంచొచ్చాడు" ప్రక్కనున్న పెద్ద మనిషి నుద్దేశించి అన్నాడు రామిరెడ్డి.

"ఆహా" అన్నట్టు చూశాడతను.

"గొడ్లు కొంటున్నాడు."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? బెంగుళూరు వాళ్ళకీ వాళ్ళకీ పట్టిస్తున్నాడు. నువ్వేమైనా అమ్మేట్టుంటే తెల్లారి చెప్పు. మర్నాడు వెళ్ళిపోతాడు"

అతడికర్థమయింది. గత నాలుగైదు నెలల్నుంచీ ఇలా దళారులు కర్ణాటక నుంచీ ఇతర ప్రదేశాల నుంచీ వచ్చి కరువునాసరాగా పశువుల్ని చవగ్గా కొనేసి కబేళాకి తోలేస్తున్నారు. గడ్డి లేక ముందూ, బియ్యం లేక ఇప్పుడూ అమ్మేస్తున్నారు బక్కచిక్కిన రైతన్నలు.

రాబందుని చూసిన కోడిపిల్లలా ఆ పెద్దమనిషి వంక భయంగా బెదురుగా చూసి ఒక్కడుగు వెనక్కేశాడు.

"జీవాల్ని అమ్మేట్టుంటే చెప్పు."

తలూపి వెనుదిరిగి పెద్ద పెద్ద అంగలెయ్యసాగాడు తననెవరో తరుముకొస్తున్నట్టు చెంచయ్య.

కళ్ళ ముందు తనకున్న రెండు ఆవులూ కదిలాయి. కళ్ళలోకి నీళ్ళు పొంగివచ్చాయి. అవి దీనంగా చూస్తున్నట్టన్పించే సరికి అతడి గుండె చెరువైపోయింది.

దుక్కిఎద్దులు లేకపోయినా ఇన్నాళ్ళూ వాటితోనే చేను దున్నాడు. అవి ఇచ్చిన పాలు తాగాడు. తన సంపద అని చెప్పుకోడానికి మిగిలినవి కూడా అవే. అలాటి వాటి నమ్మి...

"అమ్మను...అమ్మలేను!" గొణుక్కున్నాడు.

అతడి కాళ్ళాగాయి.

ఎదుట సెనగ సేలు.

పచ్చగా దుబ్బుల్లా ఉండాల్సిన చేలు మాడి వాడి దీనంగా చూస్తూ అంతిమ క్షణాలు లెక్కపెడుతున్నట్టుగా ఉన్నాయి.

కన్నీళ్లు బుగ్గ మీంచి జలజలా రాలిపడ్డాయి. దాహంతో అల్లాడుతోన్న భూదేవి ఆ నీటి చుక్కల్ని ఆబగా త్రాగేసింది.

గట్టు మీద కూలబడ్డాడు చెంచయ్య.

ఈ పంట మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు తను!

గత మూడేళ్ళు నుంచీ వానదేవుడు అలుగుతూనే ఉన్నాడు. వచ్చే ఏడాది వానలు బాగా పడతాయిలే అనుకొంటోంటే ఆ ఏటి కాయేడు వర్షం తక్కువై బతుకు దుర్భర మవుతూనే ఉంది.

ఇలా ఎన్నాళ్ళో ఎన్నేళ్ళో!

ఆకాశం వంక చూశాడు. చిన్న నల్లని మబ్బుకోసం ఆశగా వెదికాడు. ఉహూ. ఎక్కడా జాడలేదు సరికదా ఎండ మండిపోతోంది!

నిట్టూర్చాడు.

ఏదో వాన పడింది గదా అని చేను దున్ని విత్తనాలు నాటాడు. అప్పుచేసి ఎరువులు తెచ్చి చిమ్మాడు. మొక్క కూడా బాగానే వచ్చింది. అప్పులు పోను ఏవో నాలుగు తిండి గింజలు కొనుక్కోవచ్చులే అనుకున్నాడు. పిల్ల పెళ్ళి వచ్చే ఏడాది తలపెట్టొచ్చులే అనుకున్నాడు. కానంతా తారుమారైపోయింది. అదునుకి వర్షం పడలేదు. అదును పోయాక కూడా పడలేదు. వర్షంకోసం చూసి చూసి కళ్ళు కాయలు కాసిపోయాయి. నీళ్ల కోసం శనగచెట్లు చూసి చూసి పూరా మాడిపోయి నీరసంగా నిస్తేజంగా ఉ ండిపోయాయ.

వో వారం రోజుల్లోపల రెండు పదున్ల వాన పడితే బాగానే ఉణ్ను చెట్టుకి రెండో మూడో కాయలు కాసును. కాని ఆ ఆశా కన్పించడంలేదు. ఈసారి మొత్తం పెట్టుబడీ శ్రమా బూడిదలో పోసిన పన్నీరయ్యేట్టుంది.

కళ్ళు తుడుచుకుంటూ లేచి నడుస్తున్నాడు మెల్లగా. ఓపిక లేనట్టు కాదు ఓపిక లేక.

దేవుడికి రైతుల మీదింత కోపం ఎందుకో! లేకపోతే ఏమిటీ కలికాలం కరువు కాలం!

వర్షం కోసం భారతం చెప్పించారు. కృత్రిమ మడుగులో బ్రాహ్మల చేత జపాలు చేయించారు. పూజలు చేశారు. గంగానమ్మ తల్లి గుడి ముందు పొట్టేళ్ళని బలి ఇచ్చారు.

వూహూఁ ఒక్క చుక్క నీటిబొట్టు రాలితే ఒట్టు.

'పాపమో శాపమో!' గొణుక్కున్నాడు.

ఇంటికి దగ్గర్లోని టొమాటో చేను వైపు అడుగు వేశాడు చెంచయ్య.

పది కుంట్ల చేనులో టొమాటో చెట్లు నాటాడు. కానేం లాభం? నీళ్ళు లేక ముక్కాలు భాగం ఎండిపోయింది. మిగిలిన 'కాలు' భాగాన్నైనా రక్షించుకోకపోతే గంజి నీళ్ళకి నూకలు కూడా దొరకవని అర మైలు దూరానున్న బావి నుంచి నీళ్ళు తెచ్చి పోస్తూ ఎలాగో చావకుండా బతక్కుండా తడుపుకొచ్చారిన్నాళ్ళూ. అవి దయ తలిచి నాలుక్కాయలు కాస్తుంటే వాటినే సంతలో అమ్ముకొస్తున్నారు వారానికో తట్టో తట్టన్నరో.

కాని ఆ బావిలోనూ నీళ్ళెండి పోయాయి. దానితో చతికిలబడక తప్పలేదు తమకి. చేను కూడా ఎండిపోతూంది!

ఉబికి వచ్చిన కన్నీళ్ళనైనా తుడుచుకోకుండా ప్రతి 'చెట్టు' నీ పరీక్షించి చూశాడు. కుక్క మూతి పిందెల్లాంటి కాయలు ఒకటో అరో ఉన్నాయి చెట్టుకి!

పోనీ మంచినీళ్ళ బావి లోంచే ఎలాగో తంటాలు పడి కాసిన్నీళ్ళు తోడుకొచ్చి పోస్తే?

గబగబా ఇంటికెళ్ళి "వూరి బాయి నుంచి కుండెడు నీళ్ళైనా పొయ్యందే టమాటా చేను బతకదు" అన్నాడు బాధగా భార హృదయంతో.

"ఇంకెక్కడి నీళ్ళు! మనం తాగటానికైనా రెండు మైళ్ళ దూరాన్నుంచి తెచ్చుకోవాలి" కళ్ళు తుడుచుకుంటూ అందతడి భార్య.

"వూరిబాయి కేమయిందే?"

"మునుస్వామి కూతురు నీళ్ళు తోడబోయి జారి పడింది"

"అయ్యో! ఎలా ఉందే?"

"ఇంకేం ఉండటం. అంత అయిపోయింది. అసలందులో ఉన్నవే కాసిన్నీళ్ళు. అవైనా పాతాళాన్నున్నాయ్. తల పగిలి నెత్తురు మడుగయింది."

"ఎంత ఘోరం!" నిస్త్రాణగా కూలబడ్డాడు.

నవ్వుతూ తుళ్ళుతూ తిరిగే ఆ అమ్మాయి కళ్ళు ముందు కదిలింది.

"గంగానమ్మ తల్లి బలి తీసుకుంది కాబోలు" అప్రయత్నంగా వచ్చేశాయా మాట లతడి నోటివెంట.

చిత్రంగా చూసిందామె భర్త వంక. కొన్ని క్షణాలయ్యాక అంది మెల్లగా నూతిలోంచి మాట్లాడినట్టు "బాయి పూడ్చెయ్యాలంటున్నారు."

అదిరి పడి చూశాడు నమ్మలేనట్టు.

చట్టుప్రక్కల ఊళ్ళలోని చాలా బావుల్లాగే ఆ వూరి బావులూ ఎండిపోయాయి ఒక పెద్ద బావి తప్ప. అందులో వూరుతున్న జలం ఆ వూరి జనం చావకుండా బతికిస్తూంది. అది కూడా పూడ్చేస్తే... ఇక గుక్కెడు నీళ్ళు కూడా దొరకవు కాబోల్రా దేవుడా ఈ పల్లెలో!

ఇప్పటికే కూలీ నాలీ చేసుకునే జనమంతా తిరుపతో రేణిగుంటో వెళ్ళిపోయారు. ఇక ఇప్పుడు రైతులుకూడా....!

కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. దుఃఖం గొంతులో సుళ్ళు తిరిగింది.

"జొన్నలైనా చూడు. ఇట్టాగైతే బతకలేం"

భార్య మాటలు వినబడనట్టుండి పోయాడు.

"ఇంక అప్పు పుట్టదు. మేం బతకాలంటే జీవాలు సావాల్సిందే" గొణుక్కున్నాడు.

మెల్లగా లేచి పశువుల కొట్టం లోకి నడిచాడు.

ఎక్కడైనా గడ్డి పరక దొరక్కపోతుంతా అని ఆశగా వెదుకుతూ కల తిరుగుతున్నాయి - ఆవులు రెండూ. ఆస్థిపంజరాలకి తోలు కప్పినట్టుగా ఉన్నాయవి!

ఎగిసెగిసి పడుతూన్న వాటి ఎండినడొక్కలు చూసేసరికి చెంచయ్య కడుపు తరుక్కు పోయింది.

ఒకప్పుడు వాటి పాలే జీవనాధారం. ఇప్పుడు సేద్యానికవే ఆధారం. వయసొచ్చి నప్పట్నుంచీ ఏదో రకంగా తమకి సాయపడుతూనే ఉన్నాయి. తమ కడుపులు నింపుతూనే ఉన్నాయి. కాని తనే వాటి కడుపులు నింపలేక ఎండబెడుతూ వాటి ఉసురు పోసుకుంటున్నాడు!

కన్నీటి తెరలోంచి మసక మసగ్గా కన్పిస్తూన్న ఆవుల్ని సమీపించి ఆప్యాయంగా వాటి వీపు నిమిరాడు. ఏదైనా తినడానికి పెడతాడేమోనని ఆశగా మోరెత్తి చూశాయి. అతడి చేతుల్లో ఏమీ కన్పించకపోయినా ఆశ చావక చేతులు నాకసాగాయి.

"గడ్డే కాదే మర్నాటి నుంచి నీళ్ళు కూడా...."

బావురు మన్నాడు చెంచయ్య.

ఎప్పటికో తేరుకుని గుండె దిటవు చేసుకుని లేచాడు.

"ఆవుల్ని అమ్మేస్తున్నాను" ఇంట్లో కెళ్ళి జనాంతికంగా అన్నాడు శూన్య దృక్కుల్తో.

తుళ్ళిపడ్డారతడి భార్యా బిడ్డలు. అతడి భార్య ఏదో అనడానికి నోరు తెరిచింది గాని నోట్లోంచి మాట రాలేదు. కాని కళ్ళ నుంచి నీళ్ళు వచ్చాయి!

ఇంటి పరిస్థితి తెలుసు గనుక మౌనంగా ఉండి పోయారంతా.

ఇంతవరకూ నూకలు కొనిపెట్టిన టొమాటో చెట్లు మాడిపోతూ తమ కడుపులు మాడిస్తున్నాయి. కడుపులు మండి మాడి మసైనా పిడికెడు గింజలు దొరికే మార్గంలేదు. రోజు దొర్లే దారి లేదు.

అప్పు చేసే సెనగ వేశారు. ఎరువు వేశారు. అదైనా మామూలు అప్పుకాదు. బజారు రేటు నూట యాభై ఉన్నా మరెంత ఉన్నా దానితో సంబంధం లేకుండా మూట సెనక్కాయ వంద రూపాయల చొప్పున సుబ్బయ్య సెట్టికి అమ్మేట్టు ఒప్పందం. అలాగైతేనే అప్పిస్తాడాయన. ఆయనో ఆయన్లాటి మరొకరి దగ్గరో తప్ప రైతుకి అప్పు లభించే అవకాశం లేదు. దుడ్లు లేకపోతే సెనక్కాయ విత్తనాలు వేసే పరిస్థితి లేదు.

ముందు గొయ్యి, వెనుక నుయ్యి.

అందుకే గోతిలోకి దిగారు.

తనేకాదు తనలాటి సన్నకారు రైతులంతాను.

వర్షం దగాచేసే సరికి దిక్కులేని పక్షుల్లా విలవిల్లాడటం తప్ప కన్నీరు కారుస్తూ చెట్టుకి పుట్టకీ రాయికీ రప్పకీ మొక్కటం తప్ప ఏమీ చెయ్యలేని పరిస్థితిలో అలమటిస్తున్నారిప్పుడు.

చేసిన అప్పులు భవిష్యత్తుని మింగటానికి గుంటకాడి నక్కలా కాసుక్కూర్చునుంటే దారిద్ర్యం వర్తమానాన్ని నమలకుండానే మ్రింగేస్తోంది!

రత్నాల సీమగా పేరు గాంచిన రాయలసీమలో రైతు చుట్టూ కన్ను పొడుచుకున్నా కానరానంత అంధకారం అలుముకుంది నేడు!

"రామిరెడ్డింటికి తోలుకు రారా" కొడుక్కి చెప్పి గబగబా నడిచాడు. తన ముఖం ఇంట్లో వాళ్ళకే కాదు, పశువులకూడా చూపించలేక!

దారిలో ఒకచోట రాబందుల గుంపుని చూసి అదిరిపడ్డాడు చెంచయ్య.

చెట్ల మీద బండల మీద కూర్చుని చూస్తున్నాయవి. అవి చూస్తున్న వైపు చూశాడు.

దుక్కిటెద్దు. చనిపోయిందో సొమ్మసిల్లి పోయిందోగాని కదలక మెదలక పడిఉంది. దాని చుట్టూ కాచుక్కూర్చున్నాయ్ రాబందులు!

కాస్సేపటికి జరగబోయేదేమిటో తెలుసు. అందుకే వడివడిగా అడుగులేశాడు.

"ఇప్పుడు గొడ్లు. పరిస్థితి ఇలాగే ఉంటే రేపు మనుషులు...!"

కడుపులో చేయి పెట్టి దేవినట్టు అన్పించింది.

కలతపడ్డ మనస్సుతో బరువెక్కిన గుండెతో రామిరెడ్డి ఇంటి కెళ్ళాడు చెంచయ్య.

మరి కాస్సేపటికి తోలుకురాబడ్డ ఆవుల్ని రామిరెడ్డీ అతడి బావా పరీక్షగా చూశారు.

"ఇన్నూర్లిస్తాను దుడ్లు." వ్రేళ్ళకున్న ఉంగరాలని సవరించుకుంటూ తప్పనిసరై ఎంతో ఎక్కువ ఇస్తున్నట్టు ముఖం పెట్టి అన్నాడు రామిరెడ్డి బావ.

నడి నెత్తిమీద పిడుగు పడ్డట్టు అదిరి పడ్డాడు చెంచయ్య.

"ఇన్నూరా!" అన్నాడు నమ్మలేక.

కరువొచ్చినందువల్లగాని లేకపోతే ఏడెనిమిది నూర్లకి తక్కువ పలికేవికాదు మరి!

"అదేం మాట చెంచయ్యా వూళ్ళ సంగతి చూస్తున్నావుగా!" రామిరెడ్డి అన్నాడు.

"నీ ఆవులు అయిదారు నూర్లు చేస్తాయి కాదనను. కాని వాటి చేత పని చేయించుకోడానికో మరో దానికో కాదు కదా నేను కొంటూంట. కబేళానికి తోల్టానికి కొంటున్నాను. అంటే ఏవిటన్నమాట? ఎంత కండ ఉంటే ఎంత మాంసం ఉంటే దాన్ని బట్టి రేటన్నమాట. ఆపైన నీ ఇష్టం. వీట్ని లారీలో తోలు కెళ్టానికి చాలా దుడ్లవుతాయి నాకు"

"మున్నూర్లైనా..." చచ్చిచెడి అడిగాడు.

"అబ్బే అడుగుతున్నావు గనుకు పద్దైదిత్తాను. తర్వాత నీ ఇష్టం"

"ఇంకేంరా చెంచయ్యా! చాలామంది కన్నా నీ ఆవులు బాగానే పలికాయిలే" వంతుపాడాడు రామిరెడ్డి.

కాచుక్కూర్చున్న అవసరాలు గుర్తుకు వచ్చాయి. కడుపులో ఆకలి పేగు ఆవులించింది. కళ్ళ ముందు రాబందు కదిలింది.

ఈ అవకాశం చేజారితే మళ్ళీ వీటిని కొనే వాళ్లు దొరుకుతారో లేదో నన్న అనుమానం అంతకంతకూ అధికమవసాగింది. దారిలో కనిపించిన సొమ్మసిల్లిన ఎద్దు కళ్ళముందు గిర్రున తిరగసాగింది.

అవసరం తనది. అవకాశం వాళ్ళది.

నష్టపోయే దెప్పుడూ తనే మరి!

"ఇయ్యి" అతి కష్టం మీద అన్నాడు చెంచయ్య.

రెండు కొత్త వందనోట్లూ మూడు అయిదు నోట్లూ చేతిలో పెట్టాడు రామిరెడ్డి.

చూడకూడ దనుకుంటూనే మనసుండ బట్టలేక ఆవుల వంక దీనంగా చూశాడు.

ఆ చూపుల్లో వాటికేం అర్థాలు కన్పించాయోగాని అంబా అన్నాయి రెండూ ఒక్కసారే.

గుండె నీరయింది.

కళ్ళల్లో కన్నీటి కుండలు భళ్ళున పగిలాయి.

చేతులెత్తి వాటికి నమస్కరించి గబగబా బయటికి నడిచాడు.

గత్యంతరం లేక కారుచౌకగా అమ్మేశాడు ఆవుల్ని. కాని రేపు మళ్ళీ కొనగలడా? కొనలేకపోతే సేద్యం చెయ్యడమెలా? అలా అని అమ్మకుండా ఉంటే అవెన్నాళ్ళు బతుకుతాయి? తామెన్నాళ్ళు బతుకుతారు?

"చెంచయ్యా!"

ఉలిక్కిపడి చూశాడు.

సుబ్బయ్య సెట్టి!

ప్రక్కపల్లె వాడీ పల్లెలో అదీ రామిరెడ్డింటి ముందున్న అరుగు మీదెందుకు కూర్చున్నట్టు? ఎవరికోసం కాచుకున్నట్టు?

"కొత్త నోట్లా? ఈ మధ్య బెంగుళూరు నోట్లనీ దొంగ నోట్లొస్తున్నాయి చెంచయ్యా. ఇలా ఇయ్యి చూస్తాను" కులాసాగా నవ్వుతూ అన్నాడు.

యాంత్రికంగా అందిచ్చాడు రెండు వంద నోట్లనీ.

పరీక్షగా చూసి "మంచివేలే" అంటూ మడచి తన జేబులో పెట్టుకుంటూ అన్నాడు. "నీ అప్పులో జమ కట్టుకుంటాన్లే. ఎలాగూ సెనక్కాయ చేజారినట్టే కదా!"

దిమ్మెరపోయి చూశాడు చెంచయ్య.

అతడికి సుబ్బయ్య సెట్టి కన్పించలేదు.

రాబందు కన్పించింది.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక)

**23.3.1983**